పాఠశాలలో దంత వైద్య శిబిరం



ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ స్కూల్‌లో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఫిలింనగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో గురువారం మెగా డెంటల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపును డెంటల్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ జి. బాబూరావు ప్రారంభించారు. 600 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు దంత సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో ఉస్మానియా డెంటల్ వైద్యులతో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు అవసరమైన చికిత్సలతో పాటు మందులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ నాగేష్ కంపాటి, డిస్ట్రిక్ట్ అడ్వైజర్ లయన్ సూర్యరాజ్, జీఎస్‌టీ కో ఆర్డినేటర్ పద్మావతి, వీడీజీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.5 వేలు చేయాలి

బీఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా



ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు, కార్మికులు

పటాన్‌చెరు టౌన్: ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.5 వేలకు పెంచాలంటూ బీఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం పటాన్‌చెరు ఈపీఎఫ్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రదీప్‌కుమార్, జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... కార్మికులు రిటైరైన తర్వాత ఎలాంటి ఆధారం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1995లో ఏర్పాటు చేసిన ఈపీఎఫ్ పెన్షన్ స్కీంలో కార్మికులకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. కనీస పెన్షన్ వేయి రూపాయలు సరిపోవని ఆవేదన వ్యక్తం చేశారు. 30 సంవత్సరాలు ఉద్యోగం చేస్తే ఎలాంటి ఆసరా ఉండడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్మికులకు ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.5 వేలు పెంచి డీఏ ఇవ్వాలని, ఈపీఎఫ్ 95 పెన్షనర్లకు ఆయుష్మాన్ భారత్ వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈపీఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ సీనియర్ నాయకులు జనార్దన్ రెడ్డి, అంజయ్య, జగదాస్ ,జిల్లా ఉపాధ్యక్షులు ఆదినారాయణ, విజయ్, రిటైర్డ్ ఉద్యోగులు, వివిధ పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో 23, 24 తేదీల్లో ఒగ్గుకథ, సెమినార్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఈనెల 23, 24 తేదీలలో ఒగ్గుకథ , సెమినార్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు హెచ్‌సీయూ జానపద సాంస్కృతిక కేంద్రం అధిపతి డాక్టర్ జూలీ గురువారం తెలిపారు. హెచ్‌సీయూలో సెంటర్ ఫర్ ఫోక్ కల్చర్ స్టడీస్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన జానపద నాటక కళారూపం ఒగ్గుకథ అని ,కొమురవెల్లి మల్లన్న ఒగ్గు కథ కళా బృందం సింగారపు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి, ప్రముఖ నాటక రచయిత, దర్శకుడు, అధ్యాపకుడు డాక్టర్ కుమారస్వామి నిర్వహణలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా దేశ, విదేశాల నుంచి వచ్చి హెచ్‌సీయూలో చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ జానపద కళా రూపాల గురించి తెలుస్తుందన్నారు.



ప్రధానరోడ్డు.. చెత్తకుప్పలు



చందానగర్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ బస్తీ లింక్ రోడ్డులో చెత్త చెదారం పేరుకుపోయింది. చెత్త కుప్పలతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తతో దోమలు ప్రబలి పరిసర ప్రాంతవాసులు విష జ్వరాల బారిన పడుతున్నారు. మార్తాండ నగర్, ప్రేమ్‌నగర్ నుంచి రోడ్డంతా చెత్తతో నిండిపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.రోడ్లపై పేరుకుపోతున్న చెత్త చెదారంతో దోమలు పెరిగిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రేమ్‌నగర్ బస్తీలో అంతర్గత రోడ్లు సీసీ వేసి ప్రధాన రోడ్డును మాత్రం అలాగే వదిలేశారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరుతున్నారు. కాగా ప్రేమ్‌నగర్, మార్తాండనగర్ బస్తీల ప్రజలు చెత్త తీసుకువచ్చి ప్రధానరోడ్డుపై వేస్తున్నారు. చెత్త కుప్పలను తొలగించడంతో బాటు అక్కడ చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





అస్తవ్యస్తంగా ప్రేమ్‌నగర్-లింక్ రోడ్డు

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం....మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 12 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అన్నదానం



కూకట్‌పల్లి: సేవ్ ఏ లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీలోని మైత్రీ చిల్డ్రన్స్ హోం, ఆలివ్‌కాలనీ రాజేశ్వరి వృద్ధాశ్రమంలో గురువారం అన్నదానం చేశారు. అమెరికాలోని న్యూజెర్సీ వాస్తవ్యులు శరత్ సూరగన, సుభాషిణి సూరగన దంపతుల విరాళంతో అన్నదానం చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాణా ప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.

క్రీడా పాలసీకి దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి రూరల్ : క్రీడా పాలసీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా యువజన క్రీడల అధికారి ఖాసీంబేగ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ ఆదేశాల మేరకు క్రీడా పాలసీని రూపొందించిందని చెప్పారు. 2019 నుంచి రాష్ట్ర, జాతీయ,అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు తమ దరఖాస్తులను కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడాకార్యాలయంలో ఈనెల 24వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 సంవత్సరానికి బీబీఏ-1, హిస్టరీ-1 అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అభ్యర్థులు బీబీఏ, ఎంబీఏ, హిస్టరీ సంబంధిత సబ్జెక్టులో పీజీ డిగ్రీ కలిగి 55 శాతం, ఎస్సీ ఎస్టీలకు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది. సెప్టెంబరు 21వ తేదీ సమయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతాయన్నారు. సంబంధిత పత్రాలతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలో పాల్గొనాలన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం రానివ్వొద్దు



పైపులైన్ లీకేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అధికారులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌లో మంజీరా ప్రధాన పైపులైన్ లీకేజీ సమస్యను గురువారం వాటర్‌బోర్డు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాకి అంతరాయం లేకుండా చూడాలని అధికారులను కోరారు. ఇతర చోట్ల కూడా లీకేజీలు ఉన్నాయేమో పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో డీజీఎం భాస్కర్, నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి, డీఈ రమేష్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు లభిస్తుంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : రామచంద్రాపురం పట్టణంలోని గీతాభూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర శాసనమండలి మాజీ ప్రోటెం చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం రామచంద్రాపురం పట్టణంలోని కళాశాలలో కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో బదిలీ అయిన ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పని చేసినప్పుడు గుర్తింపు వస్తుందన్నారు. అధ్యాపకులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు కుమార్‌గౌడ్, జగన్నాథ్ రెడ్డి, రామకృష్ణ, లింగయ్య, లింగయ్య, దిలీప్‌సింగ్ పాల్గొన్నారు.

సమగ్ర వ్యాపార, విద్యా వ్యవస్థను సృష్టించడమే లక్ష్యం

రాయదుర్గం: బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మేనేజ్‌మెంట్ కోర్సును మరింత సులభతరం చేయడానికి హైదరాబాద్ నాలెడ్జి సిటీలో గురువారం కొత్త అండర్ గ్రాడ్యుయేట్ కోర్సును ప్రారంభించారు. 12వ గ్రేడ్ తర్వాత విద్యార్థులకు అనుభవజ్ఞులైన విద్యావేత్తలు, రియల్‌టైమ్ వ్యవస్థాపకులు, సీఎక్స్‌ఓఎస్ ద్వారా బోధించడానికి మూడేళ్ల ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ కోర్సు వీలు కల్పిస్తుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవస్థాపకుడు పవన్ అల్లెనా మాట్లాడుతూ రాబోయే తరం వ్యవస్థాపకులకు సమగ్ర వ్యాపార, విద్యా, పర్యావరణ వ్యవస్థను సృష్టించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

విద్యార్థులు హిందీ నేర్చుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం హిందీ దివస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నరేందర్ రెడ్డి హిందీ భాష ప్రాముఖ్యతను ,నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులు విఎస్ఎస్‌శర్మ మాట్లాడుతూ హిందీ నేర్చుకోవటం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని, ఇతర ప్రాంతాల సంస్కృతిని తెలుసుకోగలుగుతారన్నారు. ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ అభియాన్‌లో హిందీ భాష కీలకంగా పనిచేస్తుందన్నారు. హిందీ దేశ భాషగా, రాజ భాషగా, జాతీయ భాషగా నేర్చుకోవటం ఎంతో ముఖ్యం అని అన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వం, ఉపన్యాసం, చిత్రలేఖనం, కవిత్వంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నజీముద్దీన్, మల్లారెడ్డి, గాయత్రి, సత్యనారాయణరెడ్డి, శంకరప్ప, ప్రవీణ్, మాణిక్యం, రామ్మోహన్, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్వేతారెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు

మియాపూర్: ప్రజాభవన్ ముట్టడికి బీఆర్ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ పార్టీ నాయకులను ముందస్తుగా మియాపూర్, చందానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో ప్రజాభవన్‌కు పిలుపునిచ్చిన రైతన్నలకు మద్దతు తెలిపిన శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్, శేరిలింగంపల్లిలోని బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ నాయకులు వాలా హరీష్‌రావు, గోపరాజు శ్రీనివాస్‌రావు, రోజ, కిరణ్ యాదవ్, మల్లేష్, జనార్దన్‌గౌడ్, జహంగీర్, మల్లారెడ్డి, తిరుమలేష్, ప్రతాప్‌రెడ్డి, ఉమేష్ తదితరులున్నారు. అలాగే బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం అని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని డాక్టర్ అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంవీకే(మంజీరా విద్యాకేంద్రం) ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన డ్రగ్స్ వ్యతిరేక సదస్సులో డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు అందజేయాలని కోరారు. డ్రగ్స్ కొన్నా అమ్మినా చట్టరీత్యా నేరమని చెప్పారు. ఈ సదస్సులో ఎంవీకే ఫౌండర్ సభ్యులు రాజయ్య, కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ... డ్రగ్స్ ను అరికట్టాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అంబార్య నాయక్, సభ్యులు బాసిత్, సుదర్శన్ రెడ్డి, ఇమ్మాన్యుయేల్, బాబు సురేష్, కాలేజీ లెక్చరర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 40, పచ్చిమిర్చి 40, బెండ 50, కాకర 60, దొండ 50, దోస 40, ఆలు 40, చామ 50, కీర 40, బీర 70, వంకాయ 50, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 100, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 300.

అత్యుత్తమ అధ్యాపకులజాబితాలో 29 మంది హెచ్‌సీయూ ప్రొఫెసర్లు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 29 మంది ప్రొఫెసర్లు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ అధ్యాపకుల జాబితాలో స్థానం పొందారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన ఐయోనిడిస్ ఇటీవల గ్లోబల్ టాప్ 2 శాతంను ప్రచురించడం మరో విశేషం. అంతర్జాతీయ స్థాయిలో రెండు శాతం మంది అధ్యాపకులలో హెచ్‌సీయూ నుంచి ప్రొఫెసర్లు గోవర్ధన్ మెహతా, ఎంఎస్‌వి ప్రసాద్, అత్తిపల్లి ఆర్‌రెడ్డి, ఏఎస్ రాఘవేంద్ర, సోమ వేణుగోపాలరావు, ప్రమోద్ కె నాయర్, అశ్విని కె నంగియా, రాజదురై చంద్రశేఖర్, అనునయ్ సమంత, నాగేందర్ కుమార్ సూర్యదేవర, సతీష్ నారాయణ శ్రీరామ, అలోక్‌సింగ్, నియాజ్ అహ్మద్, ఎస్ఎన్‌కౌల్, డి నారాయణరావు, డాక్టర్ అరుణశ్రీ ఎం కల్లే, అప్పారావు పొదిలే, లలిత గురుప్రసాద్, దేవులపల్లి రామాచారి, కారుమూరి అశోక్, జి వైదీశ్వరన్, సచిన్ భలేకర్, సూర్య,, ఎస్ఆర్ శేట్యే, కెడిసేన్, డీవీ బసవయ్య, మారియప్పన్ పెరియస్వామి, సముద్రా నిల్‌పాల్, డాక్టర్ మేహనాథన్ ముతమిలరసన్ ఉన్నారు.

కబడ్డీ పోటీలు



విజేతలకు ట్రోఫీలను అందిస్తున్న దృశ్యం


రాయదుర్గం: రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి కబడ్డీ పోటీలను గురువారం నిర్వహించారు. అండర్-14, అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీలను వేర్వేరుగా నిర్వహించారు. ఈ పోటీలలో 20 ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలలకు చెందిన 80 కబడ్డీ టీమ్‌లు పాల్గొన్నాయి. అండర్-17 బాలుర విభాగంలో విజేతగా గంగోత్రి స్కూల్, జెడ్పీహెచ్ఎస్ రాయదుర్గం రన్నరప్‌గా నిలిచింది. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తాజ్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పీఈటీలు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు వినతి

మియాపూర్: కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీలో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులను చేపట్టాలని కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాలనీలో అసంపూర్తిగా మిగిలిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో దేవేందర్‌రావు, విరూపాక్షయ్య, బాలు చౌదరి, బీఆర్ చౌదరి తదితరులున్నారు.



కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు



రూ.3.56 లక్షలకు లడ్డూను దక్కించుకున్న బొల్లంపల్లి సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు



మియాపూర్ ధర్మపురి క్షేత్రంలో..

లడ్డూల వేలం

మియాపూర్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మియాపూర్ ధర్మపురి క్షేత్రంలో బుధవారం రాత్రి లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో రూ.లక్ష 91వేలకు బోయపాటి రాజేష్, బుచ్చిబాబులు కైవసం చేసుకోగా, రెండో లడ్డూను రూ.63వేలకు విజయ్‌కుమార్, మూడవ లడ్డు రూ.53వేలకు టి. రవీంద్ర పాడుకున్నారు.

నల్లగండ్ల శివాలయంలో.. రూ. 3.56 లక్షలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల శివాలయం గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డూను వేలంలో బొల్లంపల్లి సత్యనారాయణరెడ్డి, బొల్లంపల్లి రాజేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.3.56 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు బొల్లంపల్లి వెంకట్‌రెడ్డి, ప్రతినిధులు బి.రాజిరెడ్డి, బి.దామోదర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పి.రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.